పకడ్బందీగా తనిఖీలు నిర్వహించాలి

మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

- కలెక్టర్ అనురాగ్ జయంతి
- అధికారులకు దిశానిర్దేశం

కలెక్టరేట్, అక్టోబర్ 18: అసెంబ్లీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున జిల్లాలోని అధికారులు పకడ్బందీగా తనిఖీలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ హాల్‌లో సహాయ వ్యయ పరిశీలకులు, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, వీఎస్‌టీ, వీవీటీ, ఎస్ఎస్‌టీ, అకౌంటింగ్ బృందాలకు కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించడంలో ఈ బృందాలు క్రియాశీలక పాత్ర పోషించాలన్నారు. సెలవు దినాల్లో నిఘాను మరింత పెంచాలని సూచించారు. సాధారణ ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా తనిఖీలు చేపట్టాలన్నారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని తెలిపారు. చెక్‌పోస్ట్‌ల వద్ద పకడ్బందీగా తనిఖీలు నిర్వహించాలని, స్టాటిక్ సర్వేలెన్స్ అధికారులు ప్రతి వాహనాన్ని వీడియోగ్రఫీతో తనిఖీ నిర్వహించాలని చెప్పారు. వాహనాల తనిఖీ, జప్తు చేసిన నగదు, ఇతర సమాచారానికి సంబంధించిన రికార్డు సమాచారాన్ని, నిర్దిష్ట ఫార్మాట్ లలో సంబంధిత అధికారులు రోజువారీగా పంపాలని ఆదేశించారు. జప్తు చేసిన వాటికి రసీదు ఇవ్వాలన్నారు. రాత్రి సమయాల్లో పలు జాగ్రత్తలతో తనిఖీలు నిర్వహించాలని సూచించారు. డబ్బు, మద్యం అక్రమ రవాణాను అరికట్టాలన్నారు. వ్యయ పరిశీలకులు వచ్చేలోగా మరోసారి సభ్యులకు శిక్షణ ఇస్తామని చెప్పారు. సమావేశంలో మాస్టర్ ట్రైనర్ ఉపేందర్, జిల్లా ఆడిట్ అధికారి స్వప్న, డిప్యూటీ రిజిస్ట్రార్ రామకృష్ణ, ట్రైనింగ్ పర్యవేక్షకులు, సీపీవో పీబీ శ్రీనివాసాచారి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్యను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు

అత్యధిక మెజార్టీ సాధనే లక్ష్యంగా పని చేయాలి

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య

ముస్తాబాద్, అక్టోబర్ 18: రానున్న ఎన్నికల్లో సిరిసిల్ల అసెంబ్లీ నియోజకవర్గం నుంచి మంత్రి రామన్నకు అత్యధిక మెజార్టీ సాధించడమే లక్ష్యంగా పని చేయాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. నూతనంగా ప్రారంభించిన జిల్లా పార్టీ కార్యాలయంలో బుధవారం ముస్తాబాద్ మండల ప్రజాప్రతినిధులు జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్యతోపాటు పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి గ్రామంలో బీఆర్ఎస్ కార్యకర్తలు సైనికులుగా పనిచేసి మెజార్టీ లక్ష్యంగా సమష్టి నిర్ణయాలతో ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ జనగామ శరత్‌రావు, జడ్పీటీసీ గుండం నర్సయ్య, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బొంపెల్లి సురేందర్‌రావు, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలు సాధించిన యువకులకు సన్మానం

ప్రభుత్వ ఉద్యోగం సాధించిన యువకులను సన్మానిస్తున్న సర్పంచ్ రాజు

గంభీరావుపేట, అక్టోబర్ 18: ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన ముగ్గురు యవకులను నర్మాలలో సర్పంచ్ ఎడబోయిన రాజు బుధవారం సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామానికి చెందిన పసుపునూరి గోపాలకృష్ణ–రమ్య కుమారుడు వంశీ ఇండియన్ ఆర్మీ, పాక లింగం–దేవవ్వ కుమారుడు వేణు స్టేట్ పోలీస్, పాక రంజిత్ అగ్నిపథ్‌లో ఉద్యోగాలు సాధించారని తెలిపారు. వ్యవసాయ కుటుంబాల నుంచి ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడంతో వారితోపాటు తల్లిదండ్రులను అభినందిస్తూ సన్మానించామన్నారు.

సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభ విజయవంతం

మాట్లాడుతున్న ఎంపీపీ మానస, ఏఎంసీ చైర్ పర్సన్ సరస్వతి

- తరలివచ్చిన ప్రజానీనాకానికి కృతజ్ఞతలు
- తంగళ్లపల్లి ఎంపీపీ మానస, ఏఎంసీ చైర్ పర్సన్ సరస్వతి

సిరిసిల్ల రూరల్,అక్టోబర్ 18: సిరిసిల్లలో మంగళవారం జరిగిన సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభ విజయవంతమైందని తంగళ్లపల్లి ఎంపీపీ పడిగెల మానస, ఏఎంసీ చైర్ పర్సన్ పూసపల్లి సరస్వతి పేర్కొన్నారు. బుధవారం తంగళ్లపల్లి మండల కేంద్రంలో బీఆర్ఎస్ మహిళా విభాగం అధ్యక్షురాలు మోర నిర్మల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభకు తరలివచ్చిన మహిళలు, నేతలు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో మంత్రి కేటీఆర్ లక్షకు పైగా మెజార్టీతో విజయం సాధించడం ఖాయమని పేర్కొన్నారు. బీఆర్ఎస్ మ్యానిఫెస్టో పేదలకు వరమని పేర్కొన్నారు. ప్రజలు బీఆర్ఎస్‌ను ఆశీర్వదించి, మూడోసారి కేసీఆర్‌ను సీఎం చేయాలని కోరారు. సమావేశంలో సర్పంచ్ అంకారపు అనిత, ఏఎంసీ డైరెక్టర్ సద్ద రోజా తదితరులు ఉన్నారు.

సెంట్రల్ సివిల్ సర్వెంట్ల క్షేత్ర పర్యటన

గంభీరావుపేట: నర్మాలలోని కాలనీలలో పర్యటిస్తున్న సివిల్ సర్వెంట్లు

గంభీరావుపేట, అక్టోబర్ 18: నర్మాలలో యూపీఎస్సీ సెంట్రల్ సివిల్ సర్వెంట్లు శిక్షణలో భాగంగా బుధవారం రెండో రోజు క్షేత్ర పర్యటన చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రభుత్వం చేపట్టిన ఆయా వసతులు, రైతు వేదిక, సీసీ రోడ్లు, మురుగు కాలువలను పరిశీలించారు. గ్రామంలో జరిగిన అభివృద్ధిని సర్పంచ్ వారికి వివరించారు. కార్యక్రమంలో సివిల్ సర్వెంట్లు జటిన్ కుమార్‌యాదవ్, టాపామే మండల్, అంబుజ్ తోమార్, జై ప్రకాశ్ కుమావత్, రాహుల్, సర్పంచ్ ఎడబోయిన రాజు, పంచాయతీ కార్యదర్శి తదితరులు ఉన్నారు.

బొప్పాపూర్‌లో ...

ఎల్లారెడ్డిపేట, అక్టోబర్ 18: బొప్పాపూర్‌లో జరిగిన అభివృద్ధిని ట్రెయినీ ఐఏఎస్‌లు పరిశీలించారు. క్షేత్ర పర్యటనలో భాగంగా బుధవారం పలు కార్యాలయాలను సందర్శించారు. అభివృద్ధి కార్యక్రమాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయ మార్కెట్ కార్యాలయం, రైతువేదిక, గ్రామపంచాయతీలను సందర్శించారు. గ్రామ నిర్మాణం, అభివృద్ధిపై ప్రజాప్రతినిధులు, అధికారులు ట్రెయినీ ఐఏఎస్‌లకు వివరించారు. ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మన్ ఎలుసాని మోహన్ తదితరులు ట్రెయినీ సర్వెంట్లను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ట్రెయినీ ఐఏఎస్‌లు రాహుల్ సింగ్, శుభంసింగ్, రవికుమార్‌మీనా, అమిత్, నితిన్‌యాదవ్, సర్పంచుల ఫోరం మండలాధ్యక్షుడు కొండాపురం బాల్‌రెడ్డి, ఎంపీడీవో చిరంజీవి తదితరులు ఉన్నారు.

ఎల్లారెడ్డిపేట: బొప్పాపూర్‌లో ఏఎంసీ కార్యాలయంలో సెంట్రల్ సివిల్ సర్వెంట్లను సన్మానిస్తున్న ఏఎంసీ చైర్మన్ మోహన్‌కుమార్

బెల్టు షాపులు నడిపితే చర్యలు తప్పవు

నర్సక్కపేటలో పట్టుకున్న మద్యం బాటిళ్లను చూపుతున్న ఎస్ఐ సుధాకర్, సిబ్బంది

- ఎస్ఐ దాస సుధాకర్
- కిరాణా షాపులో మద్యం బాటిళ్లు స్వాధీనం

ఇల్లంతకుంట, అక్టోబర్ 18 : ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా బెల్టు షాపులు నడిపితే చర్యలు తప్పవని ఎస్ఐ దాస సుధాకర్ హెచ్చరించారు. బుధవారం నర్సక్కపేటలోని ముత్యం రాముకు చెందిన కిరాణా దుకాణంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నాడని వచ్చిన సమాచారం మేరకు పోలీసులు తనిఖీలు నిర్వహించి రూ . 11 వేల విలువైన 19 లీటర్ల మద్యం బాటిళ్లను పట్టుకుని సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఎవరైనా కిరాణా దుకాణంలో అక్రమంగా మద్యం అమ్మడం, బెల్టు షాపులు నిర్వహించడం, ఎన్నికల కమిషన్, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టి వేత

అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను బుధవారం పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సుధాకర్ తెలిపారు. వల్లంపట్ల గ్రామ శివారులో ఎలాంటి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ సీజ్ చేసి, డ్రైవర్ ప్రదీప్, ట్రాక్టర్ యజమాని నాయిని శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో హెడ్ కానిస్టేబుల్ భూమయ్య, కానిస్టేబుళ్లు తిరుపతి, మధు, శ్రీనివాస్, శ్రీకాంత్ ఉన్నారు.